
సాక్షి
కుమురం భీం
మంగళవారం ¦ 9 ¦ ఏప్రిల్ ¦ 2024



షడ్రుచుల ఉగాది
తెలుగు పంచాగం ప్రకారం మంగళవారం నుంచి శ్రీక్రోధి నామ సంవత్సరం మొదలవుతుంది. తెలుగువారికి ఇది మొదటి పండుగ.
8లో▸

రంజాన్ వేళలు
మంగళ
ఇఫ్తార్
6:33
బుధ
సహర్
4:40

గరిష్ఠం/కనిష్ఠం
36.8 /24.6

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కాస్త తగ్గుతుంది. చినుకులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు



వీసీలో పాల్గొన్న ఎస్పీ, అధికారులు

ఆసిఫాబాద్‌: నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మల్టీజోన్‌ ఐజీ రంగనాథ్‌ అన్నారు. సోమవారం హైదరాబాద్‌ నుంచి ఎస్పీలు, అదనపు ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాల మొక్కల పెంపకం, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. భద్రత విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలు రవాణా చేసినా.. వినియోగించినా కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎస్పీ సురేశ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్‌, సీఐలు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

‘అంగన్‌వాడీ’లకు రిటైర్మెంట్‌ బెన్‌ఫిట్స్‌ ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఐసీడీఎస్‌ పరిధిలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్‌ బెన్‌ఫిట్స్‌ ఇవ్వాలని అంగన్‌వాడీ యూనియన్‌ జిల్లా కార్యదర్శి త్రివేణి డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలో ఇన్‌చార్జి డీడబ్ల్యూవో రేణుకకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్‌లకు రూ.లక్ష పదవీ విరమణ బెన్‌ఫిట్స్‌ పెంచాలని, 60 ఏళ్లు దాటిన తర్వాత వీఆర్‌ఎస్‌ తీసుకునే సౌకర్యాన్ని కల్పిస్తూ జీవో జారీ చేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలని కోరారు. ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులు, మంత్రులకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. నాయకులు శ్రీనివాస్‌, ధనలక్ష్మి, ఉమాదేవి, సువర్ణ తదితరులు ఉన్నారు.

పలు మండలాల్లో చిరుజల్లులు

ఆసిఫాబాద్‌: వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఆదివారం కురిసిన చిరుజల్లులు ఉపశమనం కలిగించాయి. అకాల వర్షంతో వాతావరణం చల్లబడింది. సోమవారం జిల్లాలో 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్‌లో 5.2 మిల్లీ మీటర్లు, కెరమెరిలో 2.4, వాంకిడి 1.0, సిర్పూర్‌(టి) 3.6, కౌటాల 1.2, పెంచికల్‌పేట్‌ 1.4, లింగాపూర్‌ 3.0, సిర్పూర్‌(యూ) 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు పంచాంగ శ్రవణం

ఆసిఫాబాద్‌: ఉగాది పర్వదినం పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో ఆర్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఖండ కార్యవాహ గుండేటి కోటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం ఉంటుందని, ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు చల్లటి నీరు అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉద్దవ్‌

కెరమెరి: వేసవి దృష్ట్యా విద్యార్థులు తాగేందుకు చల్లటి నీరు అందించాలని అకాడమిక్‌ మానిటరింగ్‌ అధికారి(ఏసీఎంవో) పుర్క ఉద్దవ్‌ అన్నారు. మండలంలోని జోడేఘాట్‌, బాబేఝరి, హట్టి ఆశ్రమ పాఠశాలతోపాటు చిన్నపాట్నాపూర్‌, పెద్దపాట్నాపూర్‌, సాకడ ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. కనీస సామర్థ్యాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎస్సీఆర్‌పీ చహకటి శ్యాంరావు, హెచ్‌ఎంలు ఉన్నారు.

మండుటెండల్లో నిరీక్షణ!

ఇది రెబ్బెన మండలంలోని గోలేటి ఎక్స్‌రోడ్‌ ప్రాంతం. ఇక్కడ గోలేటితో పాటు పలు గ్రామాల ప్రజలు బస్సు కోసం వేచి చూస్తుంటారు. సింగరేణి జీఎం ఆఫీస్‌ సైతం గోలేటిలోనే ఉండటంతో సాధారణ ప్రయాణికులతోపాటు కార్మికులు వందలాది మంది ఈ ఎక్స్‌రోడ్డు వద్ద బస్సుల కోసం వేచి చూస్తుంటారు. నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా గతంలో ఇక్కడ ఉన్న బస్‌షెల్టర్‌ తొలగించారు. మళ్లీ నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే వేచి చూస్తున్నారు.





నాలుగు వరుసల జాతీయ రహదారి నుంచి జైత్‌పూర్‌, బోర్దా గ్రామాలకు వెళ్లే లింక్‌ రోడ్డు ఇది. ఇక్కడ గతంలో బస్‌షెల్టర్‌ ఉండగా ప్రయాణికులు ఇక్కడే వేచి చూసేవారు. మూడేళ్ల క్రితం ఫోర్‌ లేన్‌ రహదారి నిర్మాణంలో భాగంగా బస్‌షెల్టర్‌ తొలగించారు. అప్పటి నుంచి ప్రయాణికులు ఎండను తట్టుకోలేక చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. వర్షం కురిస్తే తడవడం తప్ప వీరికి మరో దారి లేదు.



ఇది వాంకిడి మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్‌ ప్రాంతం. ఇటు వైపు ఉన్న పదుల గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలన్నా.. జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా ఇక్కడే వేచి చూడాలి. నిత్యం వందలాది మంది ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుల కోసం వేచి ఉండేందుకు ఎలాంటి సౌకర్యం కల్పించకపోవడంతో స్థానిక దుకాణాల వద్ద తలదాచుకుంటున్నారు. రద్దీ ఎక్కువగా ఉంటే ఎండల్లోనే వేచి చూడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జాతీయ రహదారి విస్తరణలో బస్‌షెల్టర్ల తొలగింపు
- హైవే వెంబడి గ్రామీణులకు తప్పని కష్టాలు
- ఎండలోనే బస్సుల కోసం ప్రయాణికుల ఎదురుచూపు
- చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్‌

వాంకిడి(ఆసిఫాబాద్‌): కొద్ది రోజులుగా భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఇలాంటి తరుణంలో వాహనాల కోసం ఎదురుచూసే ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. నిలబడేందుకు నీడ లేక అల్లాడుతున్నారు. ఓ వైపు ఎండ, వేడిగాలి ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా.. నాలుగు వరుసల జాతీయ రహదారి– 363 వెంబడి కనీసం బస్‌షెల్టర్లు కానరావడం లేదు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అధికారులు భూసేకరణ చేపట్టారు. అనేక గ్రామాలకు వెళ్లే లింక్‌ రోడ్ల వద్ద ఉన్న బస్‌షెల్టర్లను తొలగించారు. కానీ ఇప్పటివరకు మళ్లీ గ్రామీణుల సౌకర్యార్థం ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. వేసవి నేపథ్యంలో చలువ పందిళ్లు, గ్రీన్‌ నెట్లు ఏర్పాటుకు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా ప్రయాణికులు బస్సులు, వాహనాల కోసం ఎండలోనే నిరీక్షించాల్సి వస్తోంది.

ఎండలోనే ఎదురుచూపులు

జిల్లాలోని రెబ్బెన మండలం నుంచి వాంకిడి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన గోయెగాం వరకు 52 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ రహదారి గుండా ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు వీలుగా బస్‌ షెల్టర్లను మాత్రం ఇప్పటికీ నిర్మించలేదు. రహదారి విస్తరణకు ముందు అనేక గ్రామాలకు వెళ్లే లింక్‌ రోడ్ల వద్ద బస్‌షెల్టర్లు ఉండేవి. భూసేకరణలో వాటిని కూల్చివేశారు. ప్రస్తుతం ప్రతిరోజూ పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు పైగా నమోదవుతుంది. బస్సుల కోసం వేచి చూసే జనాలు ఎండలతో పడరాని పాట్లు పడుతున్నారు. రెబ్బెన మండలంలో ప్రధానంగా గోలేటి ఎక్స్‌రోడ్‌, కాగజ్‌నగర్‌ ఎక్స్‌రోడ్‌, ఖైరిగాం, ఎడవెల్లి, ఆసిఫాబాద్‌లోని బూర్గుడ, సాలెగూడ, ఇప్పల్‌నవెగాం, వాంకిడి మండలంలోని జైత్‌పూర్‌ బోర్దా, ఇందాని ఎక్స్‌రోడ్‌, బెండార, సామేల, ఖమాన ఎక్స్‌రోడ్‌, బంబార, గణేష్‌ పూర్‌, మహాగాం గ్రామాల వద్ద సమస్య ఎక్కువగా ఉంది. విద్యార్థులతోపాటు సాధారణ ప్రజలు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముదురుతున్న ఎండలు

ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. మార్చి చివరి వారంలో 40 నుంచి 42 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదు కావడంతో వాతావరణశాఖ ఆరెంజ్‌ అలర్ట్‌ ప్రకటించింది. మార్చిలోనే 40 డిగ్రీలు దాటిన నేపథ్యంలో ముందు మరింతగా ఎండలు పెరిగే సూచనలు ఉన్నాయి. సాధారణంగా ప్రతీ ఏడాది ఏప్రిల్‌, మే నెలల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో వేడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆకాశం మేఘావృతం కావడంతో సోమవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. మంగళ, బుధవారం మరింత తగ్గి పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది.

జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు

తేదీ	ప్రాంతం	డిగ్రీలు (సెల్సియస్‌)
ఏప్రిల్‌ 3	తిర్యాణి	42.5
ఏప్రిల్‌ 4	ఆసిఫాబాద్‌	43.3
ఏప్రిల్‌ 5	దనోరా	43.3
ఏప్రిల్‌ 6	ఎల్కపల్లి	44.4
ఏప్రిల్‌ 7	జంబుగా	42.6
ఏప్రిల్‌ 8	వంకులం	39.7

ఎండలోనే ఉంటున్నాం



హైవే నిర్మాణంలో భాగంగా గోలేటి ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న బస్‌షెల్టర్‌ తొలగించారు. తిరిగి నిర్మించకపోవడంతో నిలబడేందుకు కూడా సరైన స్థలం లేదు. బస్సు ఆగే చోట కనీసం చెట్లు, దుకాణాలు కూడా లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోనే ఉంటున్నాం. అధికారులు స్పందించి బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయించాలి.
– రాయిల్ల నర్సయ్య, గోలేటి, రెబ్బెన మండలం

బస్‌షెల్టర్లు నిర్మించాలి

పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని జాతీయ రహదారి– 363 వెంట ఉన్న ప్రతీ లింక్‌ రోడ్డు వద్ద బస్‌షెల్టర్లు నిర్మించాలి. నిత్యం ప్రయాణాలు సాగించే వందలాది మంది ఎండ, వానకు తలదాచుకునేందుకు చోటు ఉండటం లేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.
– చిరంజీవి, ప్రయాణికుడు

తాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యాచరణ

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

తిర్యాణి(ఆసిఫాబాద్‌): వేసవిని దృష్టిలో ఉంచుకుని జూన్‌ ముగిసే వరకు తాగునీటి ఇబ్బంది లేకుండా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరా, ఉపాధిహామీ పనుల నిర్వహణ, వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ బోర్‌వెల్స్‌, మిషన్‌ భగీరథ పథకం అందుబాటులోని లేని ప్రాంతాల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి అమలు చేయాలని ఆదేశించారు. బోరుబావులు, చేతిపంపులు, వ్యవసాయ బోరుబావులు, బహిరంగ బావుల్లోని నీటి నమూనాలను సేకరించి పరీక్షించాలన్నారు. సురక్షితమైన నీటిని ప్రజలకు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేసి వేసవిలో నీటి ఎద్దడితో తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతోపాటు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో సురేందర్‌, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్‌, ఎంపీడీవో వేముల మల్లేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు వందరోజుల పని కల్పించాలి

అర్హులైన కుటుంబాలకు వందరోజుల పని కల్పించాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. మండలంలోని మొర్రిగూడలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారితో కలిసి పరిశీలించారు. కూలీలు ఉదయమే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

శివుడి సన్నిధిలో ‘పర్వదినం’



శంకర్‌లొద్ది గుహ



దేవుళ్ల ప్రతిమలు

- కెరమెరి మండలం శంకర్‌లొద్దిలో నేడు ఉగాది వేడుకలు
- భారీగా తరలిరానున్న భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్‌): కెరమెరి మండలం కరంజీవాడ పంచాయతీ పరిధిలోని శంకర్‌లొద్దిలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. బంజారాల గురువు ప్రేంసింగ్‌ మహరాజ్‌ ఆరేళ్లు తపస్సు చేసిన స్థలంగా దీనికి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఏటా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సేవాలాల్‌ భక్తులు తరలివస్తారు. శంకర్‌లొద్ది గుహలో కొలువైన శివలింగాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

శ్రీరామనవమి వరకు దీక్ష

మహాశివరాత్రి నుంచి శ్రీరామనవమి వరకు బంజారాలు సేవాలాల్‌ దీక్ష వేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీక్ష గురు ఇచ్చిన ఆధ్యాత్మిక కేంద్రంగా శంకర్‌లొద్దిని వారు భావిస్తారు. ప్రతిఏటా సేవాలాల్‌ భక్తులు అనేక మంది పాదయాత్రగా ఇక్కడికి వచ్చి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుంటారు. దుర్గాదేవి, సేవాలాల్‌ మహరాజ్‌తోపాటు జెండాలు, ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కాగా.. శంకర్‌లొద్దికి సమీపంలోనే జంగుబాయి అమ్మవారు కొలువైన గుహ ఉంది. ఆదివాసీలు సిద్దికసగా పిలిచే శంకర్‌లొద్దిని జంగుబాయి ఉత్సవాలకు వెళ్లే ముందు దర్శించుకుంటారు.

నేటి నుంచి పాదయాత్ర

సేవాలాల్‌ భక్తులు మహారాష్ట్రలోని వాషీమ్‌ జిల్లాలో కొలువైన పోహరాదేవి ఆలయానికి సోమవారం నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నారు. శంకర్‌లొద్దిలో పూజలు చేసిన అనంతరం వీరు సుమారు 280 కిలోమీటర్ల దూరంలోని ఆలయానికి బయలుదేరుతారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు శ్రీరామనవమి రోజున మాల విరమణ చేస్తారు. శంకర్‌లొద్దిలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు భోగ్‌భండార్‌ నిర్వహిస్తామని సేవాలాల్‌ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు రాథోడ్‌ శంకర్‌ నాయక్‌ తెలిపారు. భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉగాది విక్రయాలు



తెలుగువారి నూతన సంవత్సరం క్రోధి నామ సంవత్సరం ఉగాదికి స్వాగతం పలికేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. సోమవారం నుంచే జిల్లా కేంద్రంలో సందడి మొదలైంది. పట్టణంలోని మార్కెట్‌లో ఉగాది పచ్చడి సామగ్రి, పూజా సామగ్రి కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపారు. కొత్త చింతపండు, వేప పూత, మామిడికాయలు, కొత్తబెల్లం, ఇతర వస్తువులు కొనుగోలు చేశారు. కిలో మామిడికాయలు రూ.50కి విక్రయించగా, చింతపండు కిలోకు రూ.100 వరకు విక్రయించారు. - ఆసిఫాబాద్‌

కష్టానికి దక్కిన ఫలితం

- మౌంట్‌ భగీరథి 2 పర్వతారోహణకు ఎంపికైన కార్తీక్‌



గిత్తే కార్తీక్‌(ఫైల్‌)

కెరమెరి(ఆసిఫాబాద్‌): మారుమూల గిరిజన గ్రామానికి చెందిన ఆ యువకుడు పడిన కష్టానికి ఫలితం దక్కింది. పలు కఠిన శిక్షణల అనంతరం హిమలయ పర్వత శ్రేణిలోని మౌంట్‌ భగీరథి 2 అధిరోహణకు ఎంపికయ్యాడు. కెరమెరి మండలం కెలి కె గ్రామానికి చెందిన గిత్తే రుక్మాజీ, ఇటాబాయిల కుమారుడు కార్తీక్‌ ప్రస్తుతం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని మైనార్టీ కళాశాలలో ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతున్నాడు. గతేడాది సెప్టెంబర్‌ 18 నుంచి అక్టోబర్‌ 10 వరకు సిక్కిం రాష్ట్రంలోని నామ్‌చా జిల్లాలో నిర్వహించిన పర్వతారోహణ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశాడు. వేల అడుగుల ఎత్తులోని పర్వతాలను అధిరోహించి ఏ గ్రేడ్‌ సాధించాడు. ఈ క్రమంలోనే మౌంట్‌ భగీరథి 2 పర్వత అధిరోహించేందుకు ఎంపికయ్యాడు. సోమవారం ఉత్తరాఖండ్‌కు చెందిన పర్వత ఎక్స్‌ప్లోరేషన్‌ సంస్థ ద్వారా ఎంపిక పత్రాన్ని అందుకున్నాడు. జూన్‌ 1న 6,512 మీటర్ల ఎత్తులోని పర్వతాన్ని ఎక్కనున్నాడు. పర్వతారోహణకు మొత్తం ఖర్చు రూ.1.20 లక్షలు వస్తుందని కార్తీక్‌ వెల్లడించాడు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌: పార్లమెంట్‌ ఎన్నికల విధులు అధికారులు బాధ్యతతో నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్‌, సిర్పూర్‌ నియోజకవర్గాల సెక్టోరల్‌ అధికారులకు సోమవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, దాసరి వేణుతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్‌ మాట్లాడుతూ అధికారులు హ్యాండ్‌ బుక్‌లో పొందుపర్చిన ప్రతీ అంశాన్ని తెలుసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీలు నియమించిన బూత్‌స్థాయి ఏజెంట్లకు ఫర్నీచర్‌ సమకూర్చడంతోపాటు పోలింగ్‌ కేంద్రాలకు రహదారి, అంతర్గత రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు, దివ్యాంగ ఓటర్లను తరలించేందుకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని పోలింగ్‌ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు, ఇతర వివరాలపై నివేదిక సమర్పించాలని సూచించారు. సమావేశంలో ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌ ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, కాశబోయిన సురేశ్‌, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, మాస్టర్‌ ట్రైనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి



శివ్‌నూర్‌లో తాగునీటి బావిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి

జైనూర్‌: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి అన్నారు. మండలంలోని శివ్‌నూర్‌, దుబ్బగూడ గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ వేసవి పూర్తయ్యే వరకు ప్రతీ ఇంటికి తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం జైనూర్‌ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జైనూర్‌, సిర్పూర్‌(యూ), లింగాపూర్‌ మండలాల ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మిషన్‌ భగీరథ పథకం ద్వారా నిరంతరం తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. మిషన్‌ భగీరథ, బోరుబావుల ద్వారా నీటిని సరఫరా చేయలేని ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలు, నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. స్థానిక నీటి వనరుల నాణ్యతను పరీక్షించాలని సూచించారు. లీకేజీలు, మరమ్మతులు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతిగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌ సద్వినియోగం చేసుకోవాలి

- డీఈవో అశోక్‌



మాట్లాడుతున్న డీఈవో అశోక్‌

కాగజ్‌నగర్‌రూరల్‌: అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సేవలు, ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్‌ అన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్‌ (ఇంజినీరింగ్‌ అండ్‌ అగ్రికల్చర్‌) రెసిడెన్షియల్‌ కళాశాలలు, మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్‌ కళాశాలల్లో ప్రవేశానికి కామన్‌ ప్రవేశ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని డీఆర్‌సీ భవన్‌లో నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్‌ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. డీఈవో మాట్లాడుతూ ఉచిత కోచింగ్‌ సెంటర్‌ను విద్యార్థులు వినియోగించుకుని అత్యున్నత స్థానాలకు చేరాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్దేశించుకోవడానికి, అవసరమైన మెలుకువలు నేర్పడానికి ప్రత్యేక నిపుణులతో శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 22న పాలిసెట్‌, మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ కళాశాల ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఏప్రిల్‌ 12న చివరి తేదీ అని తెలిపారు. విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోఆర్డినేటర్‌ కటుకం మధుకర్‌, కోకన్వీనర్‌ గడ్డం భిక్షపతి, విషయ నిపుణులు దుర్గం మోహన్‌, సాబీ ర్‌ అహ్మద్‌, వెంకటకిషన్‌రావు, తిరుపతయ్య, శాంతికుమార్‌, శ్యాం సుందర్‌, శాంతికుమారి, శ్రీశైలం, త్రివేణి, శ్యాం సుందర్‌ తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య


రజిత (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): భర్త వేధింపులు తాళలేక ఉరేసుకుని భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పాశిగాం గ్రామానికి చెందిన నికోడే శంకర్‌కు అదే గ్రామానికి చెందిన రజిత (23)తో 2019లో వివాహమైంది. కొంతకాలం వారి కాపురం సజావుగానే సాగింది. రజితకు సంతానం కలగకపోవడంతో ఇటీవల శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం కూడా అతిగా మద్యం సేవించి ఇంటికివచ్చి భార్యతో గొడవపడ్డాడు. నీకు పిల్లలు పుట్టడంలేదు.. నువ్వు బ్రతకడం దండగ.. చచ్చిపో.. అంటూ తీవ్రంగా దూషించాడు. దీంతో మనస్తాపానికి గురైన రజిత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి మొర్లె గజానంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత


పట్టుబడిన నగదుతో పోలీసులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్ వద్ద సోమవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.69 వేల నగదు పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్రలోని జివితికి చెందిన శెవలె చంద్రకాంత్ బులెరో వాహనంలో ఆసిఫాబాద్ వైపు నుంచి మహారాష్ట్రకు వెళ్తుండగా రూ.69 వేల నగదు తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఎస్ఎస్‌టి టీంకు అప్పగించినట్లు తెలిపారు. తనిఖీల్లో రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

షడ్రుచుల ఉగాది



- క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం
- పలు ఆలయాల్లో పంచాంగ పఠనానికి ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: చైత్రశుద్ధ పాడ్యమి నాడు వచ్చే తెలుగు వారి మొట్టమొదటి పండుగ ఉగాది. తెలుగు వారికి కొత్త సంవత్సరం ఉగాది పర్వదినంతోనే ప్రారంభమవుతుంది. తెలుగు పంచాగం ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 9న మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం మొదలవుతుంది. క్రోధి అంటే క్రోదమును కలిగించేదని అర్థం. ఉగాది రోజున ఆలయాల్లో పంచాంగ పఠనం ప్రత్యేకంగా నిలుస్తుంది. అర్చకులు, పండితులు రాశుల వారీగా తెలియజేసే ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు.

షడ్రుచులతో ఉగాది పచ్చడి

ఉగాది పర్వదినాన శిశర ఋతువుకు వీడ్కోలు పలికి వసంత ఋతువుకు స్వాగతం పలుకుతారు. ఈసమయంలోనే చెట్లు చిగురించడం, కోయిల రాగాలు వినిపిస్తాయి. ఉగాది రోజున కుటుంబ సభ్యులంతా వేకువజామునే నిద్రలేచి తలంటు స్నానాలు ఆచరిస్తారు. కొత్తబట్టలు ధరిస్తారు. ఇంటిముందు మామిడాకుల తోరణాలు కడుతారు. అందమైన ముగ్గులు వేసి వసంతలక్ష్మిని స్వాగతిస్తారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకం. షడ్రుచుల సమ్మేళనం తీపి (మధురం), పులుపు (ఆమ్లం) ఉప్పు (లవణం), కారం (కటు), చేదు (తిక్త) వగరు (కషాయం) అనే ఆరు రుచులు కలిసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. ఏడాది పొడవునా ఎదురయ్యే మంచి చెడులను కష్టసుఖాలను సంయనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి తెలియజేస్తుంది. పచ్చడి కోసం మామిడి కాయలు, వేపపువ్వు, చింతపండు, కొబ్బరి, బెల్లం వాడుతారు. ఉగాది రోజున పంచాంగ శ్రవణం, గోపూజ, ఏరువాక ఆచారాలు పాటిస్తారు.

నిరుద్యోగులకు ఆశాజనకం



శ్రీ క్రోధి నామ సంవత్సరంలో నిరుద్యోగులకు ఆశాజనకంగా ఉంటుంది. రాజకీయ అస్థిరతలు, నాయకులలో పరస్పర వ్యతిరేకతలు, వర్షాలు అధికంగా ఉంటాయి. రైతులకు అనుకూలంగా ఉంటుంది. కేంద్రంలో ప్రస్తుత ప్రభుత్వమే కొనసాగే సూచనలు అధికంగా ఉన్నాయి.

– బుడి దామోదర్‌శర్మ, సిద్ధాంతి

సమయస్ఫూర్తి అవసరం



క్రోధి అంటే క్రోధమును కలిగించేది. ఈకాలంలో ప్రజలు కోపం, ఆవేశంతో వ్యవహరించకుండా సమయస్ఫూర్తితో నడుచుకోవాలి. సమయాన్ని అనుకూలంగా మలచుకో వాలి. సుఖజీవనం సాగించాలి. – భట్టాచార్యులు, విశ్వనాథస్వామి ఆలయ అర్చకుడు

విశ్వనాథ స్వామి ఆలయంలో...

జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని బుడి దామోదర్ శర్మ సిద్ధాంతిచే ఆరుగంటలకు పంచాంగ శ్రవణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

బెల్లంపల్లిరూరల్: కన్నాల గ్రామ పంచాయ తీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం తేనెటీగలు పలువురిపై దాడి చేశాయి. ఆలయ ఆవరణలో హనుమాన్ మాలదారులు వంట చేసే క్రమంలో పొగ వ్యాపించడంతో సమీపంలోని చెట్లపైన ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి అక్కడున్న వా రిపై దాడి చేశాయి. ఆలయంలో స్వీపర్‌గా పనిచేసే బుగ్గగూడకు చెందిన జి.పోసానికి తీవ్రగాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు.

పెళ్లి విందులో కత్తిపోట్లు

- పెళ్లి కొడుకుతోపాటు మరో ఐదుగురికి గాయాలు
- మంచిర్యాల ఆస్పత్రికి నలుగురి తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న జైపూర్ ఏసీపీ


గాయపడిన పెళ్లికొడుకు


చికిత్స పొందుతున్న నెన్నల బాలు

చెన్నూర్: పెళ్లి అనంతరం బంధువులు, స్నేహితుల కోసం ఏర్పాటు చేసిన విందులో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. పెళ్లికొడుకుతోపాటు మరో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీలో చోటు చేసుకుంది. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రావు సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న నెన్నల గంగు కుమారుడు నెన్నల కిరణ్‌కు తాండూర్ మండలం అచ్చులపురం గ్రామానికి చెందిన కల్యాణితో ఈ నెల 3న వివాహం జరిగింది. ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కాలనీలో విందు ఏర్పాటు చేశారు. గంగు ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఆకుల సంజీవ్ (శ్యామ్), పందుల సమ్మయ్య విందుకు హాజరయ్యారు. అక్కడే ఉన్న గంగు మరిది కొడుకు నెన్నల శివశంకర్‌ను సంజీవ్, సమ్మయ్య పక్కకు తీసుకెళ్లి తమ మేనకోడలు కనిపించడం లేదని, పాతర్ల కార్తీక్ ఎటు పారిపోయారని కొట్టారు. శివశంకర్‌ను ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించినందుకు మద్యంమత్తులో ఉన్న సంజీవ్, సమ్మయ్యలు కోడి పందేలలో వినియోగించే కత్తులతో పెళ్లి కుమారుడు కిరణ్‌తోపాటు బంధువులపై దాడి చేశారు. కడుపులో, చేతులపై, వెనుకభాగాల్లో గాయాలయ్యాయి. దాడిలో కిరణ్‌తోపాటు నెన్నల విజయ్(బాలు), చింతకింది చరణ్, సుంకరి సింధు, సుధీర్, తుమ్మ చంద్రశేఖర్ గాయపడ్డారు. వీరిలో బాలు, చరణ్, సుధీర్, చంద్రశేఖర్‌లకు తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను పట్టుకున్నామని ఏసీపీ తెలిపారు. వారి నుంచి కోడి పందేలలో ఉపయోగించే రెండు కత్తులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ రవీందర్ పాల్గొన్నారు.

ఒకరిపై గొడ్డలితో దాడి

ఆసిఫాబాద్: ఒకరిపై గొడ్డలితో దాడికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. సీఐ సతీశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జన్కాపూర్‌కు చెందిన ఏముర్ల అశోక్, తెనుగువాడకు చెందిన పులి తిరుపతి స్నేహితులు. ఇరువురు గొడవ పడుతుండగా నా తమ్ముడినే కొడతావా? అంటూ తిరుపతి సోదరుడు పులి వెంకటి గొడ్డలితో అశోక్ తలపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న అశోక్ బావ మల్లేశ్ బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలించారు. అశోక్ సోదరుడు ఏముర్ల పోశం ఫిర్యాదు మేరకు వెంకటి, తిరుపతిపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

భీమారం(చెన్నూర్): మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం సమీపంలోని పెట్రోల్ పంప్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై రాములు తెలిపారు. మండల కోఆప్షన్ మెంబర్ బాబర్ ఖాన్, మరో వ్యక్తి తైదల నరేందర్‌తో కలిసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా మంచిర్యాల వైపు నుంచి మహారాష్ట్రవైపు వెళ్తున్న వ్యాన్ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

‘మేషన్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి’

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ డివిజన్‌లో పనిచేస్తున్న మేషన్, చిప్పింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులను కలిసి మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల కు అరకొర వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా సక్రమంగా రావడం లేదన్నారు. ప్రతీనెల 10వ తేదీలో గా వేతనాలు చెల్లించాలన్నారు. దీనిపై యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినప్పటికీ కాంట్రాక్టర్లు అమలు చేయడం లేదన్నారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు రవీందర్, నాయకులు శ్రీనివాస్. సాయికుమార్, కృష్ణ, తిరుపతి, మనోజ్ పాల్గొన్నారు.